లింగనిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

దెందులూరు: లింగ నిర్ధారణ చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. దెందులూరులోని బిఆర్‌అండ్‌డి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులకు పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు సమానమని, ఒకరు ఎక్కువ ఒకరు తక్కువనే భావన లేకుండా ఉండాలనే ఉద్దేశంతో లింగ నిర్ధారణ నిషేధించినట్లు తెలిపారు. ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ స్టాఫ్, దెందులూరు తహశీల్దార్ నాంచారయ్య, స్కూల్ కరస్పాండెంట్ నూకరాజు పాల్గొన్నారు. అలాగే దెందులూరు ఒకటో సచివాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో అరెస్ట్, రిమాండ్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా జెడ్‌పి హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

సిట్టింగుల్లో టెన్షన్..!

ఎంఎల్‌ఎల పని తీరుపై 16న సిఎం జగన్ సమీక్ష
'గడపగడప'కూ కార్యక్రమం అమలే ప్రధాన అంశం
పనితీరు సరిగా లేకపోతే టిక్కెట్‌కు ఎసరంటూ ఇప్పటికే హెచ్చరికలు
జిల్లాలో ఐదారుగురుపై అధిష్టానం అసంతృప్తి
మరోసారి గట్టిగా హెచ్చరించే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అధికారపక్షం వైసిపికి చెందిన సిట్టింగ్ ఎంఎల్‌ఎల్లో టెన్షన్ నెలకొంది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్‌పై ఇప్పటి నుంచే ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. ఎంఎల్‌ఎల పని తీరుపై ఈ నెల 16న ఆ పార్టీ అధినాయకుడు జగన్ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో ప్రధానంగా 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం సాగిన తీరుపైనే ప్రధానంగా చర్చ సాగే అవకాశం ఉంది. గత సమీక్షా సమావేశాల్లోనూ ఇదే ప్రధాన అంశంగా సాగింది. అప్పట్లో గడపగడపకూ సరిగ్గా తిరగని ఎంఎల్‌ఎలను, మంత్రులను, మాజీ మంత్రులను సైతం జగన్ హెచ్చరించారు. పని తీరు మెరుగుపర్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వడం సాధ్యం కాదని తీవ్రంగా హెచ్చరించిన దాఖలాలున్నాయి. ఈసారి జరిగే సమీక్షా సమావేశంలోనూ సరిగ్గా పనితీరు కనబరచని ఎంఎల్‌ఎలను మరోసారి గట్టిగా మందలించే పరిస్థితి ఉందని తెలుస్తోంది. ఎన్నికలకు ఏడాదిన్నర మాత్రమే గడువు ఉండటంతో ఎన్నికల వ్యూహాలపై వైసిపి అధిష్టానం దృష్టి సారించింది. రెండు జిల్లాల్లోనూ 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా 12 చోట్ల వైసిపి ఎంఎల్‌ఎలే ఉన్నారు. పాలకొల్లు, ఉండిలో మాత్రం టిడిపి ఎంఎల్‌ఎలు ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైసిపి గెలవాలనే నినాదంతో వైసిపి అధిష్టానం ముందుకు సాగుతోంది. దీంతో ప్రతి నియోజకవర్గంపైనా ఇప్పటి నుంచే దృష్టి సారించింది. ప్రజల్లో తిరగని, గ్రూపు తగాదాలతో చికాకులు తెప్పిస్తున్న ప్రజాప్రతినిధులపైన జగన్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. చాలామంది ఎంఎల్‌ఎలు 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని తూతూమంత్రంగా సాగిస్తున్నట్లు అధినాయకత్వం భావిస్తోంది. చింతలపూడితోపాటు పలు నియోజకవర్గాల్లో గ్రూపు తగాదాలు కొనసాగుతుండటంపైనా వైసిపి అధిష్టానం సీరియస్‌గా ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఇలాంటి సమస్యలను ఇప్పటి నుంచే పరిష్కరించకపోతే రాబోయే ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవని అంచనాతో ముందుగానే ఎంఎల్‌ఎలను గాడిన పెట్టేందుకు జగన్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రెండు జిల్లాల్లోనూ 14 నియోజకవర్గాలు ఉండగా ఐదారు నియోజకవర్గాల్లో 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం సరిగా సాగడం లేదనే భావన అధిష్టానం దృష్టిలో ఉన్నట్లు చెబుతున్నారు. ఆ నియోజకవర్గాలు ఏమిటనే దానిపై సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఇప్పటికిప్పుడు చెప్పకపోయినా వచ్చే ఎన్నికల్లో ఐదారు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు తథ్యమనే ప్రచారం సాగుతోంది. ఇప్పుడే ప్రకటిస్తే ఇబ్బందికర పరిస్థితులు నెలకొనే అవకాశం ఉండటంతో ప్రస్తుత హెచ్చరికలతో సరిపెట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. దీనిలో తాజా, మాజీ మంత్రుల స్థానాలు కూడా ఉన్నట్లు చర్చ నడుస్తోంది. 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం సక్రమంగా నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యమని వైసిపి భావిస్తోంది. దీంతో ఈ కార్యక్రమం సరిగా అమలు చేయని ఎంఎల్‌ఎలపై ప్రధానంగా దృష్టి సారిస్తోంది. సిటింగుల్లో ఎంతమందికి టిక్కెట్ దక్కుతుందోననే చర్చ ఇప్పటికే వైసిపిలో నడుస్తోంది. ప్రస్తుతం ఎవరి సీటుకూ ఇబ్బంది లేదని చెబుతున్నప్పటికీ ఇప్పటికే అధిష్టానం దృష్టిలో పలువురు ఎంఎల్‌ఎలపై అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది. ఎంఎల్‌ఎలు సైతం అధిష్టానం మెప్పు కోసం గడపగడపకూ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఏదేమైనా వచ్చే ఎన్నికల్లో రెండు జిల్లాల్లోనూ దాదాపుగా సగం స్థానాల్లో కొత్త అభ్యర్థులు వచ్చే అవకాశం ఉందనే అంచనాలు మాత్రం సాగుతున్నాయి. ఆశావహులు సైతం ఇప్పటి నుంచే టిక్కెట్ కోసం పైస్థాయిలో పావులు కదుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. రెండు రోజుల్లో జరగబోయే సమీక్షా సమావేశంలో పలు నియోజకవర్గాల ఎంఎల్‌ఎల పనితీరుపై జగన్ చేసే హెచ్చరికలతో కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వచ్చే మార్చి వరకూ గడపగడపకూ కార్యక్రమం ఉండటంతో సిట్టింగు ఎంఎల్‌ఎల పనితీరులో మార్పునకు అవకాశం ఉందనే చర్చ కూడా సాగుతోంది.

పెన్షన్ రూ.250 పెంపు

రూ.2,750కు చేరిన పెన్షన్ మొత్తం
రెండు జిల్లాల్లో 4.83 లక్షల మందికి లబ్ధి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల హామీ మేరకు సామాజిక పెన్షన్లకు సంబంధించి మరో రూ.250 పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. వచ్చే జనవరి ఒకటో తేదీ నుంచి పెరిగిన పెన్షన్ లబ్ధిదారులు అందుకోనున్నారు. దీంతో ప్రస్తుతం రూ.2500 అందుకున్న పెన్షన్ మొత్తం రూ.2,750కు చేరనుంది. మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పెన్షన్ పెంపునకు ఆమోదం తెలిపారు. 2019 ఎన్నికల నాటికి సామాజిక పెన్షన్ రూ.రెండు వేలుగా ఉంది. వైసిపి అధికారంలోకొస్తే పెన్షన్ రూ.మూడు వేలకు పెంచుతామని వైసిపి ప్రకటించింది. ఎన్నికల్లో గెలిచాక ప్రమాణ స్వీకారం రోజున రూ.250 పెంచుతున్నట్లు ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత రెండేళ్లకు మరో రూ.250 పెంచడంతో రూ.2,500కు చేరింది. ఇప్పుడు మరో రూ.250 పెంపుతో రూ.2,750కు పెన్షన్ మొత్తం చేరనుంది. పెన్షన్ పెంపుతో ఏలూరు జిల్లాలో 2.65 లక్షల

మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 2.18 లక్షల మంది పెన్షన్‌దారులు లబ్ధి పొందనున్నారు.

ధాన్యం రాసులను పరిశీలిస్తున్న కలెక్టర్

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మండలంలోని బుట్టాయగూడెం పంచాయతీ నారాయణపురం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ధాన్యం సేకరణ చేపట్టాలన్నారు. రైతు భరోసా కేంద్రం వద్ద సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటూ ధాన్యం సేకరించాలని సూచించారు. తేమశాతం, గోనె సంచులు, ధాన్యం రవాణా సౌకర్యం, మిల్లులకు చేరవేత తదితర వివరాలను సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించే పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్నరైతులతో ధాన్యం సేకరణకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ మాట్లాడారు. తేమశాతం గుర్తించడాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ధాన్యం సేకరణకు చర్యలు తీసుకుందన్నారు. గోనె సంచుల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ద్వారకాతిరుమల మండలంలో ఆరు రైతు భరోసా కేంద్రాల పరిధిలో 4,851 ఎకరాల వరి విస్తీర్ణం కాగా 13,268 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని తహశీల్దార్ సుందర్‌సింగ్, వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు. మండలంలో 8,808 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్న లక్ష్యానికి ఇంతవరకు 5,240 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ఈ పర్యటనలో గ్రామ సర్పంచి కేతా సుబ్రహ్మణ్యం, ఎంపిడిఒ కెవి.సుబ్బరాయన్ ఉన్నారు.

23 నుంచి అభినయ నృత్య భారతి వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరానికి చెందిన ప్రముఖ నాట్యసంస్థ అభినయ నృత్యభారతి 27వ వార్షికోత్సవం ఈనెల 23, 24, 25 తేదీల్లో వైఎంహెచ్‌ఎ హాలులో వైభవంగా నిర్వహిస్తున్నామని సంస్థ కార్యదర్శి నాట్యాచార్య డి.దువ్వి హేమసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హేలాపురి లయన్స్ క్లబ్ సర్వీస్ ట్రస్ట్, హిందూ యువజన సంఘం (వైఎంహెచ్‌ఎ), లయన్స్ డిస్ట్రిక్ట్ 316 జి, నెహ్రూ యువకేంద్రం సహకారంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కానాల గురుమూర్తి, వెంకట నారాయణమ్మ స్మారక జాతీయ స్థాయి కూచిపూడి బృంద నృత్యపోటీలు నిర్వహిస్తామని, ఈ పోటీలకు ఉభయ రాష్ట్రాలనుండి 300 మంది బాల నర్తకులు విచ్చేస్తున్నారని, భారత సాంప్రదాయ నృత్యరీతులకు చెందిన యువ నర్తకులు విచ్చేసి ప్రదర్శనలు ఇవ్వనున్నారని తెలిపారు. వారికి నృత్యకౌముది అవార్డులు అందిస్తామని, అదేవిధంగా వివిధ రంగాల్లో సేవచేసిన వారికి సేవా తపస్వి, నాట్యాచార్యులకు నృత్య తపస్వి అవార్డులతో సన్మానిస్తామని వివరించారు. నృత్యరంగంలో ప్రతిభ కనపరిచిన చిన్నారులకు నర్తనబాల అవార్డులతో సత్కారం ఉంటుందన్నారు. లయన్స్ పూర్వపు గవర్నర్లు డాక్టర్ మానం పద్మనాభం, గుత్తా సుబ్బారావు స్మారక అవార్డులను కంటి వైద్యరంగంలో అనేక సేవలందించిన నిడదవోలు, పాలకొల్లు లయన్స్ కంటి ఆసుపత్రులకు ఇవ్వనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ సెక్రటరీ, కళారత్న కెవి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ మజ్జి కాంతారావు, సకల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శలా కోటివీరయ్య, సెక్రటరీ దువ్వి రామారావు, లయన్స్ జిల్లా నాయకులు ఎల్.వెంకటేశ్వరరావు, హేలాపురి లయన్స్ ఉపాధ్యక్షులు కెబి.రావు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎంఎల్‌ఎ ఎలిజ

సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన

ఎంఎల్‌ఎ ఎలిజ

ప్రజాశక్తి - చింతలపూడి

సిఎం జగన్ తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు, సేవలు వెళ్తున్నాయని ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. చింతలపూడి పట్టణంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి యడ్ల మోహన్, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజాసుధాకర్, వైస్ ఎంపిపి గుత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గోనె సంచుల కొరత లేకుండా చూడాలి : ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

ధాన్యం కొనుగోలులో గోనె సంచుల కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా ఆదేశించారు. ఈ సందర్భంగా మండలంలోని యండపల్లిలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ కొంతమంది ఆర్‌బికె సిబ్బంది రైతులను ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. గోనె సంచుల కొరతపై జాయింట్ కలెక్టర్‌తో ఎంఎల్‌ఎ మాట్లాడారు. అవసరమైన సంచులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యయసాయాధికారులు, సొసైటీ ఛైర్మన్‌లు, తహశీల్దార్ కృష్ణజ్యోతి పాల్గొన్నారు.

ఖోఖోలో ఎపిటిబ్ల్యూఆర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుసరాజుపల్లి ఎపిటిడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల విద్యార్థులు ఖోఖో రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పాఠశాల నుండి 41వ జాతీయ జూనియర్ స్టేట్ మీట్ కర్నూలు జిల్లా ఆత్మకూరులో ఈనెల తొమ్మిదో తేదీ నుంచి 11వ తేదీ వరకూ జరిగాయి. ఈ పోటీలో పాఠశాలకు చెందిన తొమ్మిది, పది తరగతుల విద్యార్థులు టి.అనిత, ఎన్‌ఎల్.వసంత రాష్ట్రస్థాయిలో మూడోస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ ఎస్.విజయలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. తమ పాఠశాల క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. వైస్‌ప్రిన్సిపల్ బి.లక్ష్మీకుమారి, పీడీ రాధిక, పిఇటి శ్రావణి, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

నేడు నారాయణపురానికి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఉంగుటూరు

జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఈ నెల 14వ తేదీన నారాయణపురంలో పర్యటిస్తున్నట్లు ఆ పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ బాధ్యులు పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. ఉండికి చెందిన జనసేన నాయకుడు మరణించడంతో ఆయన కుటుంబానికి జనసేన క్రియాశీలక సభ్యత్వ బీమా చెక్కును నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో మనోహర్ అందజేస్తారని చెప్పారు. అనంతరం రైతులు, ఆక్వా రైతులతో మాట్లాడుతారని చెప్పారు.

పరిశ్రమల్లో కార్మికుల భద్రత పటిష్టంగా ఉండాలి

కోకాకోల ఫ్యాక్టరీ తనిఖీలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

కోకాకోల కంపెనీని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

పరిశ్రమల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు పాటించాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆయా యాజమాన్యాలను ఆదేశించారు. మంగళవారం మండలంలోని పి.కన్నాపురం సర్వారాయ సుగర్స్ బాటిలింగ్ యూనిట్‌ను జిల్లా పరిశ్రమల భద్రత పర్యవేక్షణ కమిటీ ఛైర్మన్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఇండస్ట్రీయల్ సేఫ్టీ ఇన్‌స్పెక్షన్ కమిటీ బృందంతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రత చాలా ముఖ్యమని, ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు జిఒ 79 ప్రకారం పరిశ్రమల భద్రత, మార్గదర్శకాలను ఫ్యాక్టరీ యాజమాన్యాలు ఖచ్చితంగా పాటించి అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలోని డబ్ల్యూటిపి యూనిట్, పవర్ యూనిట్, మైక్రోల్యాబ్, టెస్టింగ్ ల్యాబ్, బాయిలర్, ఎఐఆర్ కంప్రెషర్, చిల్లింగ్ ఎక్యూప్‌మెంట్, ఇటిపి ప్లాంట్, వేర్ హౌస్, స్టోరేజ్ రూమ్, కోకో కోలా బాటిలింగ్ మిషన్ ద్వారా టెస్టింగ్ చేయించి పరిశీలించారు. అలాగే ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన భద్రతకు సంబంధిత పరికరాలను, ఔషధాలను, ప్రమాదాల బోర్డులను, క్లీన్‌అండ్‌గ్రీన్ తనిఖీ చేశారు. అనంతరం ఫ్యాక్టరీకి సంబంధించిన అధికారుల కమిటీ బృందంతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఇటీవల కొన్ని పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగి ప్రాణ, ఆస్తినష్టం సంభవిస్తుందని, ఈ దృష్ట్యా వీటి నివారణకు చర్యలు తీసుకునే క్రమంలో ఆగస్టులో 79 జిఒ విడుదల చేశారన్నారు. ఈ జిఒ ప్రకారం జిల్లాలో పరిశ్రమల భద్రతా పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీలో ఛైర్మన్‌గా కలెక్టర్, కమిటీ సభ్యులుగా డిసిఐఎఫ్, పొల్యూషన్ ఇఇ, జిఎం డిఐసి, డిసిఎల్ సభ్యులుగా ఉన్నారని, వీరి ద్వారా ఫ్యాక్టరీల భద్రత అమలుపై తనిఖీ చేస్తామని, ఈ నివేదికను ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ తెలిపారు. ఏలూరు జిల్లాలో 28 ఫ్యాక్టరీలకుగాను ఇప్పటి వరకూ 16 ఫ్యాక్టరీల భద్రతా చర్యలను పరిశీలించామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించి ప్రమాదాలకు గురైన ఫ్యాక్టరీ యాజమాన్యంపై పరిశ్రమల చట్టం ప్రకారం చర్యలుంటాయని తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యం ద్వారా ప్రజలకు ఉపయోగపడే పనులు భీమడోలులో ట్రోమ్ సెంటర్ ఏర్పాటు, ఏలూరులో మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో ప్లాస్టిక్ రీ సైక్లింగ్ యూనిట్, పి.కన్నాపురంలో కంపోస్ట్ యార్డ్ ఏర్పాటుకు యూనిట్ బృందం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కెవి.రావు, కోకాకోలా బాటిలింగ్ యూనిట్ 2017లో ఏర్పాటు చేశారని 70 ఎకరాల్లోయూనిట్ కలిగిఉందని, త్వరలో రెండో యూనిట్ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని కలెక్టర్‌కు వివరించారు.

ఫ్యాక్టరీలో పరిశుభ్రత, క్లీన్ అండ్ గ్రీన్, యూనిట్ల నిర్వహణతీరును పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో సర్పంచి దాసరి రాంబాబు, డిసిఐఎఫ్‌ఆర్.త్రినాథ్‌రావు, జిఎం డిఐసి పి.ఏసుదాసు, డిసిఎల్ కె.వసంతరావు, ఫ్యాక్టరీ మేనేజర్ జివివి.సత్యనారాయణ, క్వాలిటీ మేనేజరు ఎన్.శ్రీనివాసరావు, పర్సనల్ ఆఫీసరు ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతుల ఆశలపై 'నీళ్లు'..!

వర్షాలకు తడిసి రంగుమారి, మొలకలు వస్తున్న ధాన్యం
గింజలు రాలిపోతున్న పనమీద ఉన్న పంట
ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మాండూస్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో ధాన్యపు రాసులు తడిసి గింజలు మొలకెత్తాయి. మండలంలోని 32 గ్రామ పంచాయతీల పరిధిలో 15వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. చిగురుకోట, వడాలి, పెదకామనపూడి, చినకామనపూడి, ముదినేపల్లి, పెయ్యేరు తదితర గ్రామాల్లో మాత్రమే వరికోతలు కోశారు. కోతలు కోసిన పంట మొత్తం తడిసి ముద్దయింది. ఫలితంగా ధాన్యం గింజ రాలిపోతోందని రైతులు అవేదన వ్యక్తం చేస్తునారు. ఎకరాకు రూ.30 వేలకు పైబడి పెట్టుబడి పెట్టి కష్టపడి పండించిన పంట చేతికందే దశలో వర్షాలకు నీట మునిగిపోతుంటే అన్నదాతలకు ఏమి చేయాలో తెలియక అయోమయ పరిస్థితిలో ఉన్నారు. వర్షపు నీటిలో తడిసి, రంగుమారిన ధాన్యం ప్రభుత్వం నిబంధనలు సడలించి కొనుగోలు చేసి రైతన్నలను ఆదుకోవాలని ముదినేపల్లి, గురజ, వడాలి తదితర గ్రామాలకు చెందిన రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తుపాన్ ప్రభావంతో చేతికందే వరి పంట ఈదురు గాలులకు నేల కొరిగింది. కోసిన వరిపైరును చేలల్లో కుప్పలు వేయడానికి ఆవకాశం లేకుండా పోయింది. కుప్పలు వేద్దామంటే గింజలు రాలిపోతున్నాయని, తీవ్రంగా నష్టం వాటిల్లుతున్నామని పలువురు రైతులు ఆవేనద వ్యక్తం చేస్తున్నారు. కోతదశలో ఉన్న వరి చేలు నేల కొరిగిపోవడంతో రైతులు వాటిని నిలబటే ప్రయత్నం చేస్తున్నారు. ఒక పక్క వర్షం, కురుస్తున్నప్పటికీ గత్యంతరం లేక రైతులు కోతలు కోస్తున్నారు. చేతికి వచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

తడిసిన ధాన్యం ఆరబెడుతున్న రైతులు

మొలకలు వచ్చిన ధాన్యం

స్పందించని ఆర్‌బికె, సచివాలయాల సిబ్బంది

గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షానికి దెబ్బతిన్న పంటను కాపాడుకునేందుకు సరైన సలహాలు, సూచనలు ఇచ్చే వారు కరువయ్యారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రమించి పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చే దశలో వర్షాల పాలుకావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యానికి గిట్టుబాటు ధర రాదని తెలిసి, దళారులకే తక్కువ ధరకు అమ్ముకోవాల్సి రావడంతో ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని సంతోషించే సమయంలోనే వర్షాలు ఆశలను అడియాశలు చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

15న కలెక్టరేట్ వద్ద చేనేత కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

చేనేతపై జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలని, మగ్గం నేస్తున్న ప్రతీ చేనేత కార్మికుని కుటుంబానికి నేతన్న నేస్తం పథకం వర్తింపజేయాలని కోరుతూ ఈనెల 15వ తేదీన కలెక్టరేట్ వద్ద చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శనివారపుపేటలోని వీవర్స్ కాలనీలో చేనేత కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం చేనేతపై కూడా జిఎస్‌టి భారం మోపడం అన్యాయమని ఆదిశేషు విమర్శించారు. రూ.వంద ఉన్న చేనేత వస్త్రంపై 51 శాతం జిఎస్‌టి భారం మోపడంతో సామాన్య ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని, దానివల్ల ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి వస్త్ర నిల్వలు పేరుకుపోవడంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని వారు ఆవేదనవ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టిని రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలని, మగ్గం నేస్తున్న ప్రతీ చేనేత కార్మికుని కుటుంబానికి నేతన్న నేస్తం పథకం ద్వారా రూ.24 వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎర్రా సాంబశివరావు, పి.చిన్నవెంకటేశ్వరరావు, మువ్వల అన్నపూర్ణ ఎర్ర సత్యం, ఎర్ర ఈశ్వరి, ఎన్.నాగరత్నం, కె.నాగేశ్వరి, కె.వరలక్ష్మి, సావిత్రి పాల్గొన్నారు.

నిర్వాసితులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ

నిర్వాసిత కుటుంబాలకు 'ఉపాధి' చూపండి

అధికారులకు డ్వామా పీడీ ఆదేశం

జీలుగుమిల్లి: పోలవరం నిర్వాసిత కాలనీల ప్రజలకు 'ఉపాధి' అవకాశాలు కల్పించాలని డ్వామా పీడీ రాంబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కామయ్యపాలెం, పి.అంకంపాలెం, ములగలంపల్లి పంచాయతీల్లో ఉన్న నిర్వాసిత కాలనీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పీడీ ప్రతీ గ్రామంలోని నిర్వాసితులను గుర్తించి వారికి ఎన్‌అర్‌ఇజిఎస్‌లో ఉపాధి హామీ జాబ్ కార్డులు అందించి ప్రతీ కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అదే విధంగా ఎన్‌అర్‌ఇజిఎస్ సిబ్బంది ప్రతీ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి అర్హులైన ప్రతిఒక్కరికీ ఉపాధి కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి ప్రఫుల్, ఎంపిడిఒ మంగతాయారు, ఎపిఒ జాన్ వెస్లీ, టెక్నికల్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం

మండవల్లి: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భవనాలు, ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటారని ఎన్‌హెచ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.సత్యనారాయణ పేర్కొన్నారు. మండవల్లిలో ఆయన రహదారి విస్తరణలో భాగంగా నష్టపరిహారం అందని బాధితులతో మంగళవారం మాట్లాడారు. ఆయా శాఖలతో మాట్లాడి త్వరలోనే నష్టపరిహారాన్ని తప్పనిసరిగా అందించి తీరుతామని స్పష్టం చేశారు. తహశీల్దార్ సెలవులో ఉండటంతో కొంత ఆల స్యమైందన్నారు. అంతేకాకుండా విస్తరణలో భాగంగా తన దృష్టికి వచ్చిన సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుం టామని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక సెంటర్లో ఉన్న అంబేద్కర్, గాంధీ, పొట్టి శ్రీరాములు తదితర మహనీయుల విగ్రహాలను జాగ్రత్తపరచి ఆ విగ్రహాలను వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.



నిబంధనలు పాటించాలని వాహనదారులకు గులాబి పువ్వు ఇస్తున్న విద్యార్థి

రోడ్డు నిబంధనలు పాటించాలని ర్యాలీ

ప్రజాశక్తి - భీమడోలు

రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా సురక్షితంగా ప్రయాణించాలని భీమడోలు చైతన్య హై స్కూల్ పదో తరగతి విద్యార్థులు, పాఠశాల డీన్ వి.భార్గవకిరణ్, ప్రిన్సిపల్ డి.సోహిని ఆధ్వర్యంలో భీమడోలు పురవీధుల్లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రతి నెలా నిర్వహించే సామాజిక చైతన్య కార్యక్రమం స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా రహదారి నిబంధనలు వివరిస్తూ భీమడోలులో ర్యాలీ నిర్వహించినట్లు పాఠశాల బాధ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు రోడ్డుపై ట్రాఫిక్ పోలీసులు తరహాలో దుస్తులు ధరించి ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయుల పర్యవేక్షణలో నిర్వహించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలపై ప్రయాణిస్తున్నవారిని ఆపి వారికి గులాబీ పువ్వు ఇచ్చి రోడ్డు నిబంధనలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమన్వయకర్త ఉదయభాస్కర్, పర్యవేక్షకులు ముఖేష్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

చర్చిల నిర్మాణానికి సహకారం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని చర్చిల నిర్మాణాలకు సహకారం అందిస్తామని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి సూరిబాబు అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో సియేను ప్రార్థన మందిరంలో ఏర్పాటు చేసిన మండల యునైటెడ్ పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు బ్రదర్ జి.జ్ఞాన్‌రాజు అధ్యక్షతన మంగళవారం ఐక్య క్రిస్మస్ వేడుక నిర్వహించారు. సూరిబాబు క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ల సంఘ సంక్షేమానికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్య ప్రసంగీకులుగా పాస్టర్ సిహెచ్.జాన్‌బాబు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కె.నిరీక్షణరావు, సిహెచ్.హోషేయ, నరసాపురం ప్రసన్నకుమార్, ప్రసన్నరాజు, నాయకులు దాకారపు సూరిబాబు, యర్రా గంగాధరావు, ఉమ్మిడి తేజ పాల్గొన్నారు.

కొవ్వాడలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని కొవ్వాడ గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఇంటికి వెళ్లి కార్యక్రమం ముఖ్య ఉద్దేశం వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మొగపర్తి సోంబాబు, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌ఛార్జి సున్నం నాగేశ్వరరావు, పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధ్యక్షులు మడకం కన్నపరాజు, ఎస్‌టి సెల్ మండల అధ్యక్షులు కోర్సా వెంకటేష్, తెల్లం వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి కొవ్వాసి శ్రీను, పాయం కిరణ్‌కుమార్, కామయ్యకుంట మాజీ సర్పంచి ఎం.కన్నయ్య, నాగరాజు, కుంజా దుర్గారావు, కుర్సం వెంకటేశ్వరరావు, కుంజ వెంకన్నబాబు, రేలంగి నాగబాబు, వేముల ఏసుబాబు, రేలంగి సత్యప్రసాద్, నల్లురి గాంధీ పాల్గొన్నారు.

17న దళితుల సమరభేరి

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరు కేంద్రంగా ఈ నెల 17వ తేదీన జిల్లా స్థాయిలో టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించే దళితుల సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు ర్యాలీ గోడపత్రికను భీమడోలులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు వై.సుజీవరావు, చింతలపూడి, ఉంగుటూరు నియోజకవర్గాల ఎస్‌సి సెల్ అధ్యక్షులు పి.శ్రీను, పి.యుగంధర్ పాల్గొన్నారు.

'పోలవరం'ను పరిశీలించిన ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని బృందం

పోలవరం: ఎపి ప్రెస్ అకాడమీ ఛైర్మన్, సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు బృందం మంగళవారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించింది. ప్రాజెక్టులో గ్యాప్ 1, 2, డయాఫ్రం వాల్, ఎగువ, దిగువ కాఫర్‌డ్యామ్, పవర్ ప్రాజెక్ట్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. వారికి ప్రాజెక్టు ఎస్ఇ నరసింహమూర్తి, సిఇ సుధాకర్‌బాబు, మెగా ఇంజినీరింగ్ సంస్థ సిజిఎం ముద్దు కృష్ణ సంబంధిత వివరాలను తెలిపారు. అనంతరం కొమ్మినేని శ్రీనివాసరావు ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారాలు సరికాదన్నారు. అధికారులు చెప్పిన వివరాల ప్రకారం తన పరిశీలనలో గమనించిన అంశాల్లో డయాఫ్రమ్ వాల్ నిర్మాణం, సమీపంలో పడిన గుంతలు రెండు పోలవరం ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరాకు ప్రత్యేక కారణాలుగా నిలుస్తున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ విషయంలో అధికారుల మాటలు తనకు సంతోషాన్ని కలిగించాయన్నారు. తన పరిశీలనలో ప్రతిపక్ష నేత చంద్రబాబు చేస్తున్న అసత్య ప్రచారాల్లో వాస్తవం లేదని గ్రహించానన్నారు. సిఎం జగన్ హయాంలో స్పిల్‌వే, గ్యాప్-3 వంటి భారీ నిర్మాణాలు జరిగిన ప్రచారం చేసుకోలేదన్నారు. పనులు వేగంగా జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం నిధులిస్తే మరింత వేగం పుంజుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ సెక్రటరీ బాలగంగాధర్ తిలక్, [illegible] పాల్గొన్నారు.

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

ఆగిరిపల్లి: మహిళా పోలీసులు గ్రామల్లో శాంతి భద్రతలను పర్యవేక్షించడంతో పాటు దిశ, మహిళా సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని ఎస్ఐ ఎన్.చంటిబాబు ఆదేశించారు. మంగళవారం ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో మహిళా పోలీసులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా గ్రామల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీస్‌స్టేషన్‌కు ముందస్తు సమాచారమిచ్చి శాంతిభద్రతలను పరిరక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతంలో కిడ్నాప్‌కు గురైన బాలుణ్ని గంటల వ్యవధిలోనే పోలీసులు చాకచక్యంగా రక్షించి, నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ మంగళవారం వివరించారు. తంగెళ్లమూడికి చెందిన రాచప్రోలు రమేష్‌బాబు, శాంతిప్రియ దంపతుల బాలుడు(10) ఈనెల 11వ తేదీన ఆరుబయట ఆడుకుంటున్న క్రమంలో 3.30 గంటల సమయంలో కిడ్నాప్‌కు గురయ్యాడు. తల్లిదండ్రులు బాలుడి కోసం ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. వెంటనే ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి పైడేశ్వరరావు ఆదేశాల మేరకు రూరల్ సిఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ ఎస్.లక్ష్మణబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. ఈలోపే కిడ్నాప్ చేసిన దుండగులు బాలుడి తల్లిదండ్రులకు ఫోన్ చేసి రూ.మూడు లక్షలు డిమాండ్ చేశారు. ఈ తరుణంలో సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితులను తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నంలో నిందితులను గుర్తించారు.

140 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ వివరాలు వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన పెరులాల్ జాట్, ప్రవీణ్ జాట్, లోకేష్ జాట్, రఘన్ అహీర్ ఫలుడా ఐస్‌క్రీమ్ వ్యాన్‌ను హ్యాండుకుని ఒడిశా నుంచి తీసుకెళ్తున్నారు. భీమడోలు సమీపంలో పోలీసులు చేసిన తనిఖీల్లో ఐస్‌క్రీమ్ వ్యాన్లో 140 కిలోల గంజాయిని గుర్తించారు. నలుగురు నిందితులను అరెస్టుచేసి కేసు నమోదు చేశారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రతిభ

భీమడోలులో...

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు హైస్కూల్ కేంద్రంగా మంగళవారం నిర్వహించిన మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో కురెళ్లగూడెం హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారని మండల విద్యాధికారి సాంబశివరావు తెలిపారు. ఐదు అంశాల అధారంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని నిర్వహించిన భీమడోలు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.పుష్పావతి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, విజ్ఞానాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. పూళ్ల హైస్కూల్ విద్యార్థి సిహెచ్.మణికంఠ గైడ్ టీచర్ మోహన్‌రావు ఆధ్వర్యంలో ప్రదర్శించిన నీటిపై తేలాడే గృహం, కురెళ్లగూడేనికి చెందిన గైడ్ టీచర్లు సిహెచ్.సుశీలరావు, జి.రాజు ఆధ్వర్యంలో విద్యార్థులు కె.విజయలక్ష్మి, వై.సిరి ప్రదర్శించిన మంచి శ్వాస ప్రక్రియ, వానలను గుర్తించే సూచిక, గుండుగొలను హైస్కూల్ విద్యార్థి వి.దివ్య గైడ్ టీచర్ రత్నకుమారి ఆధ్వర్యంలో ప్రదర్శించిన పర్యావరణ పరిరక్షణ, భీమడోలు హై స్కూల్ విద్యార్థి సంగీతిక గైడ్ టీచర్ హసీనా బేగం ఆధ్వర్యంలో భాగాహార యంత్రం ప్రదర్శించారని తెలిపారు. వీరు జిల్లాస్థాయి ప్రదర్శనలో పాల్గొనేందుకు అర్హత సాధిం చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భీమడోలు మండల పరిధిలోని ప్రభుత్వ హైస్కూళ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : సైన్స్ ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సైన్స్ ప్రదర్శనను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపికైన ఐదు ఉత్తమ నమూనాలు జిల్లా స్థాయిలో ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు నరసమాంబ, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు పుట్టాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో రోజు జరిగిన మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మండల విద్యాధికారి తెల్లం బాబూరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే మారుతున్న కాలానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. స్థానిక సర్పంచి తెల్లమ్మ, ఎంపిడిఒ కందుల వాణి వివిధ ప్రాజెక్టులను తిలకించి విద్యార్థుల నైపుణ్యాలను కొనియాడారు. ఈ ప్రదర్శనకు మండలంలోని అన్ని యాజమాన్యాల నుంచి 18 పాఠశాలలు పాల్గొని తొంబై ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు ప్రాజెక్టులను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిరప గంగాదేవితోపాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంపిపి గంజిమాల రామారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రత్యేక ప్రతిభ కలిగి ఉంటారన్నారు. వారి ప్రతిభను గుర్తించి వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ రామన్నదొర, ఎంఇఒ జె.సురేష బాబు, ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి నిర్మలాకుమారి, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టి.నరసాపురంలో...

కాలువపై ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలోని భువనపల్లి గ్రామ పరిధిలో ఉన్న 265 సర్వే నెంబర్‌లో సాగు మురుగు కాలువపై ఆక్రమణలను ఎంపిడిఒ ప్రకాష్ మంగళవారం పరిశీలించారు. సర్వే చేసి ఆక్రమణ తొలగించాలని సిపిఎం ఆధ్వర్యంలో రైతులు ఐదు నెలలుగా ఆందోళన చేస్తూ స్పందన కార్యక్రమంలో పలుమార్లు కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందించారు. ఈ క్రమంలో కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని ఎంపిడిఒను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఎంపిడిఒ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, సర్వేయర్లు కాల్వపై ఆక్రమణలను పరిశీలించారు. 15వ తేదీ శుక్రవారం హద్దులు ఏర్పరుస్తామని ఆక్రమణదారులకు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు మాట్లాడుతూ సమగ్రంగా సర్వే చేసి హద్దులు ఏర్పరచాలని కోరారు. పంటకు నష్టం లేకుండా సాగుకు నీరుతో పాటు భువనపల్లి వాడకం నీరు కూడా వెళ్లేలా ఆటంకం లేకుండా చూడాలని కోరారు.

ఆక్రమణకు గురైన కాల్వను పరిశీలిస్తున్న అధికారులు

14 నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు ఏలూరు జిల్లాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ పొదుపు అవగాహనా ర్యాలీలు జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా స్వయం సహాయక మహిళ బృందాలతో ముగ్గుల పోటీలు, ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహ ఉపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం అంశంపై నిష్ణాతులతో ఇంజినీరింగ్ కాలేజీల్లో వర్క్ షాపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ పొదుపుపై అవగాహన కోసం గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు డిసెంబర్ 20వ తేదీన బహుమతుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం ముంపునకు గురై మండలంలోని పునరావాస కాలనీలకు వచ్చిన కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డ్వామా పీడీ డి.రాంబాబు అధికారులకు సూచించారు. మండలంలోని కామయ్యపాలెం, పి.అంకంపాలెం, ములగలంపల్లి పంచాయతీల్లో ఉన్న నిర్వాసిత కాలనీలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న నిర్వాసితులను గుర్తించి వారికి ఎన్ఆర్ఇజిఎస్ పథకంలో ఉపాధి హామీ జాబ్‌కార్డులు అందించి ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది ప్రతి గ్రామంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించి అర్హులందరికీ ఉపాధి కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి డి ప్రఫుల్, ఎంపిడిఒ మంగతాయారు, ఎపిఒ జాన్‌వెస్లీ, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ రాంబాబు

ట్రిపుల్ ఐటి విద్యార్థులకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న రాజీవ్ గాంధీ సాంకేతిక విశ్వవిద్యాలయంలో, సివిల్ డిపార్ట్‌మెంట్ సారథ్యంలో ఆదివారం ప్రారంభమైన షార్ట్ టర్మ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ మంగళవారంతో ముగిసింది. షార్ట్ టర్మ్ ట్రైనింగ్ ప్రోగ్రాంను పురస్కరించుకుని ఉపన్యాసం కొనసాగించడానికి "హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఎక్స్‌పర్ట్' డాక్టర్ అజాజ్ ఖాన్ ఇబ్రహీం ఖాన్‌పఠాన్‌ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మూడు రోజుల షార్ట్ టర్మ్ ట్రైనింగ్‌లో భాగంగా విపరీతమైన సహజ సంఘటనల్లో వరదలు ఒకటని, దీని ఫలితంగా ఆస్తి నష్టం, సమాజాలపై ప్రతికూల ప్రభావం గురువారం విద్యార్థులకు వివరించారు. వరదలకు గురయ్యే ప్రాంతాన్ని నిర్ణయించడంలో వరద హైడ్రోడైనమిక్స్ సమగ్ర పరిశీలన ఒక ముఖ్యమైన దశగా పేర్కొన్నారు. హైడ్రోడైనమిక్ మోడల్ పనితీరును వరద లోతు, ప్రవాహ వేగం, నీటి ఉపరితల ఎత్తు, రాక సమయం వంటి కొన్ని ముఖ్యమైనవి అంచనా వేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జివిఆర్.శ్రీనివాసరావు, ఎస్ఎస్ఎస్ వి గోపాలరాజు, పరిపాలనా అధికారి ప్రదీప్‌కుమార్, డీన్ అకాడమిక్ లక్ష్మణ్‌రావు, హెచ్ఒడి బి.శ్రీనివాసరావు, ఫ్యాకల్టీ సిబ్బంది, నూజివీడు, శ్రీకాకుళం విద్యార్థులు 75 మంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇబ్రహింఖాన్‌పఠాన్

వాడీవేడిగా ఏలూరు కౌన్సిల్ సమావేశం

అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్యే వాగ్వివాదం

అరగంటలోనే అజెండాలన్నీ ఆమోదం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఆద్యాంతం వాడీవేడిగా సాగింది. ప్రజాసమస్యలకు ప్రాధాన్యత ఇవ్వకుండా పాలకవర్గం ప్రతిపాదించిన అజెండాలను చకచకా సమావేశం ముందు ఉంచడానికే అధిక ప్రాధాన్యతిచ్చారు. మొత్తం 65 అంశాలతో కూడిన ప్రతిపాదనలను కేవలం అరగంటలోనే ముగించారు. ఈ క్రమంలో స్వపక్షానికి చెందిన ఓ కార్పొరేటర్ ముందస్తు అనుమతులకు తావులేదంటూ అభ్యంతరం తెలపడంతో సభలో కొంత గందరగోళం నెలకొంది. వైసిపికి చెందిన కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావుపై అదే పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు ఒక్కసారిగా మండిపడటంతో పరిస్థితి వేడెక్కింది. ఒకానొక సమయంలో ఉమా ఉమేశ్వరరావుపై దూసుకుపోయారు. తొలుత ఈ సమావేశానికి నగర మేయర్ నూర్జహాన్ అధ్యక్షత వహించారు. ఏలూరు మాజీ ఎంపీ, సిఆర్.రెడ్డి కళాశాల పూర్వ విద్యార్థి సినీ హీరో సూపర్ స్టార్ కృష్ణ మృతికి సంతాపం తెలిపి, మౌనం పాటించారు.

రసాభాసగా సాగుతున్న సమావేశం

అనంతరం మున్సిపల్ ఎఒ సిరాజుద్దీన్ 65 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ ముందుంచారు. ఈ క్రమంలో వాటిపై విపులంగా చర్చించకుండా అరగంటలోనే ముగించారు. గత కౌన్సిల్లో ప్రవేశపెట్టి ప్రతిపాదించిన 17 అంశాలను కూడా ఈ కౌన్సిల్లో ఆమోదించారు. 65 అంశాల అనంతరం 66వ అంశాన్ని అప్పటికప్పుడే ప్రవేశపెట్టి డిప్యూటీ మేయర్లు ఇద్దరికి రెండు కార్లను అద్దెకు పెట్టుకునేలా నెలకు రూ.35 వేలు అద్దె చెల్లించేలా తీర్మానం చేశారు. ఈ 66 అంశాలకు కౌన్సిల్లో ఆమోద ముద్ర లభించింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాన్ని ఎంతగానోఅభివృద్ధి చేస్తున్నామన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో ముందుకు వెళుతున్నామని చెప్పారు. నగరపాలక సంస్థకు 47 మంది వైసిపి కార్పొరేటర్లు ఉన్నారు. కేవలం ముగ్గురు మాత్రమే టిడిపి కౌన్సిలర్లు ఉన్నారు. కానీ స్వపక్షంలోనే విపక్షం అన్నట్లుగా నగర పాలక సంస్థలో పరిస్థితి చోటుచేసుకుంది. కౌన్సిల్లో ప్రవేశపెట్టిన ఎనిమిది అంశాలకు ముందస్తు అనుమతులిచ్చామని ప్రకటించగానే వైసిపి కార్పొరేటర్ ఉమామహేశ్వరరావు తీవ్రంగా వ్యతిరేకించారు. మున్సిపల్ చట్టంలో ముందస్తు అనుమతులకు తావులేదని దీన్ని ఎప్పటినుంచో తాను వ్యతిరేకిస్తున్నానని, అయినా మళ్లీ ఇలా అనుమతులు ఇవ్వడం సరికాదని వాదించారు. వైసిపికి చెందిన మిగిలిన కార్పొరేటర్లు అతని వ్యాఖ్యలను అడ్డుకున్నారు. అతనిపైకి దూసుకెళ్లారు. కో ఆప్షన్ సభ్యులు జి.రామచంద్ర కిషోర్ అయితే కోపంతో ఊగిపోయారు. మిగిలిన వాళ్లు జోక్యం చేసుకుని శాంతింపజేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని జనన, మరణాల నమోదు విభాగంలో అవినీతి జరుగుతుందని దాన్ని ప్రక్షాళన చేయాలని వైసిపి 12వ డివిజన్ కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు సభలో పేర్కొన్నారు. అదే విధంగా గడియార స్తంభం, కత్తేపువీధి, పెద్ద పోస్టాఫీసు రోడ్లు నిత్యం రద్దీగా ఉంటాయని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సభలో నగర కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్‌బాబు, గుడిదేసి శ్రీనివాసరావు, నగర కమిషనర్ షేక్ షాహిద్, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వరరావు, అడిషనల్ కమిషనర్ బాపిరాజు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సరైన ప్రణాళికతోనే గ్రామాల అభివృద్ధి : డ్వామా పీడీ

జీలుగుమిల్లి: గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో నడవాలంటే సరైన అభివృద్ధి ప్రణాళిక ఉండాలని డ్వామా పీడీ డి.రాంబాబు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు, సచివాలయ సిబ్బందికి అభివృద్ధి ప్రణాళికపై ఇస్తున్న శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు సురక్షిత నీటిని అందించాలన్నారు. అనంతరం 2023 -24కు సంబంధించి ప్రణాళికను రూపొందించినట్లు ఎంపిడిఒ కె.మంగతాయారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపిపి కొర్స పోసమ్మ, వైస్ఎంపిపి-2 ఉప్పల లతాకుమారి, ఎంపిటిసి సురేష్, సర్పంచులు రాంపండు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై మండల స్థాయి శిక్షణా తరగతులు మంగళవారం కూడా కొనసాగాయి. ఈనెల ఎనిమిదో తేదీనుంచి 14వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ కందుల వాణి తెలిపారు. ఈ తరగతుల్లో జెడ్‌పి సిఇఒ రవికుమార్ పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి ప్రణాళిక ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు. సర్పంచులకు, ఎంపిటిసిలకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఒ వెంకటలక్ష్మి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మురళీకృష్ణ ఎపిఒ పద్మావతి, ఎంఇఒ టి.బాబూరావు పాల్గొన్నారు.

భీమడోలు: పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2023-24ను జనవరి నెలాఖరులోగా సిద్ధం చేయాలని ఎంపిడిఒ రాఘవన్ కార్యదర్శులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎంపిడిఒ ఆధ్వర్యంలో నాలుగు విడతలుగా ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ, సచివాలయాల పరిధిలోని వివిధ శాఖల అధికారులకు, ఇతరులకు గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీపై భీమడోలులో నిర్వహించిన శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ తరగతులకు సూరప్పగూడెం పంచాయతీ కార్యదర్శి టి.ముత్తయ్య, చెట్టున్నపాడు పంచాయతీ కార్యదర్శి వాసు భాను జిల్లా రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో బాధ్యులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ ఇచ్చారు.

టి.నరసాపురం : ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాలసూర్యనారాయణరాజు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి డి.లక్ష్మి, వైస్ఎంపిపి బి.దివ్యభారతి, ఎపిడిఒ ఎన్.తిరుపతిస్వామి పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంపిడిఒ

పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని మర్లపాలెం, జయపురం, తుమ్మగూడెం గ్రామాల్లోని జెడ్‌పి, ఎంపిపి పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిడిఒ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తల పనితీరు, పాఠశాలలో ఉపాధ్యాయుల విద్యాబోధన సంతృప్తికరంగా ఉందని చెప్పారు. పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, విద్యావిధానం, ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్నం భోజన నిర్వాహకుల పనితీరు మెరుగుపడిందని తెలిపారు.

పరీక్షిస్తున్న వైద్యులు

వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరాలు ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ సంతోష్‌నాయుడు అన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని సరిపల్లి గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఆరోగ్య భద్రత కోసం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజియషన్ క్యాంపులను వినియోగించుకుని ఆరోగ్య రక్షణ పొందాలన్నారు. క్యాంపులో 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ జి.విల్సన్‌బాబు, మౌనిక, ఎఎన్ఎం ఎన్.నాగవేణి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

జానపద నృత్య విజేత మాధవికి సత్కారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విద్యార్థులు కళల్లో ప్రావీణ్యం సంపాదించాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు దాకారపు కృష్ణ అన్నారు. ఈనెల ఏడో తేదీ నుంచి పదో తేదీ వరకూ శ్రీశైలంలో సనాతన నృత్య కళా విభాగ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి శాస్త్రీయ జానపద నృత్యపోటీల్లో జాతీయ స్థాయి ప్రథమ స్థానం సాధించిన యువ కళాకారిణి కొసన మాధవీ కామాక్షిని రోటరీ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. అలాగే నాట్యగురువు ప్రశాంత్‌కుమార్‌ను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి రాంగోపాల్(గోపి), రోటరీ ప్రతినిధులు ధనకుమార్, రొంగల దేవీప్రసాద్, తిలక్, సాహితీవేత్త టి.వెంకటరామకృష్ణ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాల అమలు

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామ శివారు సూరంపాలెంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకటక ప్రతాప్ అప్పారావు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయో.. లేదో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందడం లేదని, వికలాంగుల, వితంతువుల పెన్షన్, ఇళ్ల స్థలాలు కూడా రాలేదని పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంఎల్ఎ మాట్లాడుతూ అన్ని అర్హతలుండి పెన్షన్, ఇళ్ల స్థలాలు పొందని వారు వెంటనే గ్రామ సచివాలయంలో వాలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పార్టీ, కులం, మతం తేడా లేకుండా అందరికీ పథకాలు అందించడమే సిఎం జగన్ లక్ష్యమన్నారు.

లింక్ డాక్యుమెంట్స్ పోయినవి

నల్లజర్ల మండలం, దూబచర్ల గ్రామానికి చెందిన ఇడపలపాటి లక్ష్మి సురేష్ బాబు, తండ్రి: లక్ష్మీనారాయణ, అను నా పొలమునకు సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట నెం. 5659, సర్వే నెం.1ఎ1ఎ గల డాక్యుమెంటు దూబచర్ల నుండి అంబరుపేట మోటారు సైకిల్‌పై వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.

ఇడపలపాటి లక్ష్మి సురేష్ బాబు
సెల్: 94407 03078

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - పంచాయితీ రాజ్ శాఖ

గ్రామ పంచాయితీ కార్యాలయము- అమ్మవారి గూడెం

ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా

R.O.C.No. 35/2021 ps-V | Dt.12-12-2022

బహిరంగ వేలము ప్రకటన

ఆగిరిపల్లి మండలం, అమ్మవారిగూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా ఐటమ్కు బహిరంగ వేలం నిర్వహించుటకు పై అధికారుల ఉత్తర్వుల ననుసరించి ది.21.12.2022వ తేది బుధవారం సాయంత్రం 04.00 గం? లకు అమ్మవారిగూడెం గ్రామ పంచాయితీ కార్యాలయము వద్ద సదరు పంచాయితీ కార్యదర్శి గారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును. బహిరంగ వేలము నందు పాల్గొనదలచిన వారు సంబంధిత తహసిల్దారు వారి వద్ద నుండి పొందిన రూ. 10,00000/- (అక్షరాల పది లక్షల రూపాయిలు మాత్రమే) లకు సాల్వెన్సీ ధృవీకరణ పత్రము లేదా అందుకు సమానమైన రొఖమును హామీగా ఉంచి మరియు షెడ్యూల్ నందు తెలిపిన ధరావతులు చెల్లించి హెచ్చు పాట మొత్తము ఏక మొత్తము లో వెంటనే చెల్లించు విధానము ననుసరించి బహిరంగ వేలం పాటలలో పాల్గొనవలయును. వేలం షరతులు మరియు ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు తెలిసికొన వచ్చును.

వరుస నెం.	అయిటమ్ వివరము	చెల్లించవలసిన దరావత్తు	పాట కాలపరిమితి
1	ఊర చెరువు	10000	2022-2025

సం/- బి.ప్రసాద్
పంచాయితీ కార్యదర్శి, అమ్మవారి గూడెం

సం/- జలసూత్రం కొండలరావు
సర్పంచ్

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814